పునాదికే పరిమితం.. ఖడ్కి పంచాయతీ భవనం

ఖడ్కిలో పునాదికే పరిమితమైన పంచాయతీ భవనం

నార్నూర్, జనవరి 8 : గాదిగూడ మండలం ఖడ్కి గ్రామ నూతన పంచాయతీ భవన పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ప్రత్యేక భవనం లేక పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాఠశాల భవనం, చెట్ల కింద సమావేశం నిర్వహించే వారు. కేసీఆర్ ప్రభుత్వం నూతన పంచాయతీ భవనం మంజూరు చేసింది. రూ.20 లక్షలు కేటాయించింది. పర్యవేక్షణ పనులు ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించింది. నిర్మాణ పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఏడాది గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఇంకా పునాది కూడా వేయలేదని పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, సదరు కాంట్రాక్టర్ పట్టింపులేనితనంతోనే పనులు పునాధికే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, నిర్మాణం చేపట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉప తపాలాశాఖ భవనం.. ప్రారంభానికి సిద్ధం

రూ.30 లక్షలతో నిర్మాణం

- ఇన్నాళ్లు అద్దె భవనంలోనే కార్యకలాపాలు
- నిత్యం అవస్థలుపడ్డ సిబ్బంది, ప్రజలు
- మెరుగుపడనున్న సేవలు

బోథ్‌లో నిర్మాణం పూర్తయిన తపాలాశాఖ భవనం

అద్దె భవనంలో కొనసాగుతున్న పోస్టాఫీస్

బోథ్, జనవరి 7 : బోథ్‌లో కొత్తగా నిర్మించిన ఉప తపాలా శాఖ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. రూ.30 లక్షలతో భవనం నిర్మితమైంది. దశాబ్దాల కాలంగా కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతతున్నది. భవన నిర్మాణంతో సేవలు మెరుగుపడనున్నాయి. బోథ్ ఉప తపాలా కార్యాలయం (సబ్ పోస్టాఫీసు) పరిధిలో 17 పోస్టాఫీసులున్నాయి. బోథ్, బజార్‌హత్నూర్ మండలాల పరిధిలో సేవలు అందిస్తున్నాయి. బోథ్‌లోని సబ్ పోస్టాఫీసులో సబ్ పోస్ట్ మాస్టర్‌తో పాటు పోస్టల్ అసిస్టెంట్ (ప్రస్తుతం ఖాళీగా ఉంది), పోస్ట్‌మన్, ఇద్దరు జీడీఎస్ (గ్రామీణ డాక్ సేవక్) పని చేస్తున్నారు. 17 పోస్టాఫీసుల పరిధిలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ల (బీపీఎం)తో పాటు, తొమ్మిది మంది అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు (ఏబీపీఎం) పని చేస్తున్నారు. నిత్యం వీరు ఉత్తరాల బట్వాడాతో పాటు ఉపాధి హామీ కూలీల డబుబల చెల్లింపు, పింఛన్ల పంపిణీ, సేవింగ్ ఖాతాలు, రికవరింగ్ డిపాజిట్లు నిర్వాహణ వంటి పనులు నిర్వర్తిస్తున్నారు. అయితే నిత్యం బీపీఎంలు, ఏబీపీఎంలు బోథ్‌లోని కార్యాలయానికి పనుల నిమిత్తం వస్తుంటారు. కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండడంతో సరైన సదుపాయాలు, స్థలం లేక అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల కాలంగా ఉప తపాలా కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగిస్తుండడంతో పడరాని పాట్లు పడ్డారు. ఇక్కడి లావాదేవీలు, సేవలకు సొంత భవనం అవసరమని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. భవనం కోసం నిధులు మంజూరు చేసింది. పనులు చేజిక్కించుకున్న గుత్తేదారు భవన నిర్మాణ పనులను ఇటీవల దాదాపుగా పూర్తి చేయించారు. ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఎట్టకేలకు తపాలా శాఖ కార్యాలయ నిర్వాహణ కోసం సొంత భవనం అందుబాటులోకి వస్తుండడంతో అటు ఆ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు తుడుందెబ్బ మండల కమిటీ

బోథ్, జనవరి 8 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి బోథ్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు బాపురావ్, బోథ్ డివిజన్ అధ్యక్షుడు విశ్వేశ్వర్ రావ్ తెలిపారు. ఎన్నిక కోసం మార్కెట్ కమిటీ యార్డులో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాల పటేళ్లు, యువకులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 8 : సిరికొండ మండల కేంద్రంలోని కేజీబీవీలో బోధనేతర పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఇచ్చోడ ఎంఈవో ఉదయ్‌రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరికొండ మండలకేంద్రంలోని కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టు ఖాళీగా ఉన్నదని పేర్కొన్నారు. ఏడో తరగతి పాస్సై, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్యార్హత పాత్రాలతో, వంట చేసే అనుభవంగా ఉండే మహిళలు మాత్రం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు ఇచ్చోడ ఎమార్సీలో అందజేయాలని తెలిపారు.

'అప్పుల కోసం రైతులు ఎడ్లను అమ్ముకుంటున్నరు'

ఇచ్చోడ, జనవరి 8 : వానకాలంలో పంట చేనుల్లో పత్తి, సోయా తదితర పంటలకు బ్యాంక్ రుణాలు సకాలంలో అందక, ప్రైవేట్ వ్యాపారుల నుంచి అప్పు తెచ్చిన అప్పులు ఎలా తీర్చలో తెలియక రైతులు తమ ఎడ్లను అమ్ముకుంటున్నారని రైతు స్వరాజ్య జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం సంతలో రైతులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రుణమాఫీ కాకపోవడం, రైతు బంధు రాకపోవడంతో ఎడ్లను అమ్ముకుంటున్నారన్నారు. పత్తి, సోయాబిన్ పంటలకు మద్దతు ధర లేకపోవడం నష్టపోయారని పేర్కొన్నారు. రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కనికరించి రుణ మాఫీ, రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బాబు, రోహిదాస్, ఆర్ శివాలాల్, పీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు బాధితులను నిత్యం పరీక్షించాలి

- జిల్లా కుష్టు నివారణ అధికారి గజానన్

మాట్లాడుతున్న జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్

ఎదులాపురం, జనవరి 8 : ఆశావర్కర్లు తమ పరిధిలోని కుష్టు బాధితులను నెలనెలా పరీక్షించాలని జిల్లా కుష్టు నివారణ అధికారి గజానన్ సూచించారు. పట్టణంలోని పుట్లిబౌలి పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశాకార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికిత్సలో ఉన్న కుష్టు రోగులు క్రమం తప్పకుండా ఎండీటీ చికిత్స తీసుకునేలా చూడాలిసిన బాధ్యత ఆశాకార్యకర్తలపై ఉందన్నారు. కుష్టు అనుమానితులను గుర్తించి, దవాఖానకు పంపించాలని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యాధికారి ఆస్పియా ఫాతిమా, డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్‌రావు, సీవో నవీన్, స్టాఫ్‌నర్సులు నీల, సుజాత, ఇర్ఫానా, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

తనిఖీలో స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్

ఎదులాపురం, జనవరి 8 : నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నామని ట్రాఫిక్ సీఐ బీ ప్రణయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద సోమవారం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నంబర్‌ప్లేట్ లేని బైకులు, నంబర్ ఉండి వాహనానికి పెట్టకపోయినా, నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఈ మధ్య కాలంలో నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీసులు పట్టుకున్న బైకుల కోసం ప్రజాప్రతినిధులు తమకు ఫోన్ చేయవద్దని సూచించారు. ప్రతి రోజు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు 33 నంబర్‌ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ డ్రైవ్‌లో ఎస్ఐలు ఖాజామోయినొద్దీన్, సాయన్న, కానిస్టేబుల్ ఉన్నారు.

మనల్ని ఎవడ్రా.. ఆపేది

ఎదులాపూరం, జనవరి 8 : ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పోలీసులు ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ వాహనాదారుడు తన బైక్ నంబర్‌ప్లేట్ పెట్టుకోకుండా, పైగా 'మనల్ని ఎవడ్రా.. ఆపేది' అంటూ కొటేషన్ రాశాడు. ఇది గమనించిన ట్రఫిక్ పోలీసులు ఆశ్చర్యపోయారు. ఆతనిని వివరాలు అడగగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గ్రామానికి చెందిన యువ రైతు అని తెలిసింది. ఇప్పటి వరకు వాహనాన్ని రిజిస్ట్రేసన్ చేసుకోలేదని, చేయించుకున్న తర్వాతనే వాహనాన్ని రిలీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

ఉట్నూర్ రూరల్, జనవరి 8 : మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు అకారులు తెలిపారు. మొత్తంగా 21,747 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. గంగన్నపేట్, దంతన్‌పెల్లి, బీర్సాయిపేట్ గ్రామాల్లో ఐకేపీ వీవో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. గంగన్నపేట్‌లో 9,200, దంతన్‌పెల్లిలో 9,507, బీర్సాయిపేట్‌లో 3,040 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. అందుకు సంబంధించిన నగదు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలో జయచేస్తున్నట్లు చెప్పారు.

కొనుగోలు కేంద్రంలో లారీలో సంచులు లోడింగ్

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

By this deed I, the undersigned **KUMMARI MUTHYAM S/o. KANUGULA GANGANNA** R/o. H.No.2-48/112, Pakpatla (V). Soan (M) Nirmal (Dist) 504105 have Changed my name to **KANUGULA MUTHYAM S/o. KANUGULA GANGANNA** for all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి జోగు రామన్న

కార్మిక విభాగం జిల్లా అధ్యక్షురాలు అనసూయను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 8 : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ మహిళా కార్యకర్తల కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షురాలు బియ్యాల అనసూయ, సివిల్ సప్లయి సభ్యురాలు తులసి, కార్యకర్త ఉమా మహేశ్వరితో పాటు రమ కుటుంబాన్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు నిరుత్సాహపడవద్దని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంటనే జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, కార్యకర్తలు సురేఖ, అంజలి ఉన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధించుకోవాలి

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న సంతోష్

ఇంద్రవెల్లి, జనవరి 8 : పట్టుదలతో ఉన్నతంగా చదువుకొని లక్ష్యాన్ని సాధించాలని ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకుడు దుర్వ సంతోష్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో సోమవారం యుపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. పేదరికంతో చదువు మధ్యలోనే మానేయకుండా పట్టుదలతో లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. విద్యార్థులకు తనవంతుగా సహాయ సహకారాలు అందించేందుకు నిరంతరం కృషిచేస్తామని అన్నారు.

పొన్న-సుంకిడి రోడ్డు మంజూరు చేయాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 8 : సిరికొండ మండలం పొన్న గ్రామపంచాయతీ ప్రజలు మండలకేంద్రానికి చేరుకోవాలంటే దూరభారం అవుతున్నదని, సుంకిడి వరకు లింకు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం అందించారు. లింక్ రోడ్డు నిర్మిస్తే రైతులు, వాహనదారులకు ఇబ్బందులు తొలిగిపోతాయని, దూరభారం తగ్గుతుందని వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డు పనులు మొదలుపెట్టాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పొన్న గ్రామస్తులు సదానందం, సంజీవ్, రమేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ భాజ్‌పాయి

ఉట్నూర్, జనవరి 7 : గిరిజనుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో భాజ్‌పాయి తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భీంపూర్ మండలం అర్లి-టీ గ్రామానికి చెందిన దిలీప్ తనకు సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, సిర్పూర్(యు) మండలం దేవుగూడకు చెందిన సునందన కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని, గుడిహత్నూర్ మండలం గురుజా గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్ తనకు త్రీఫేజ్ కరెంట్ మంజూర్ చేయాలని, ఇంద్రవెల్లి మండలం దొడంద గ్రామానికి చెందిన కురం జ్ఞానేశ్వర్ వైద్య చికిత్స ఆర్థిక సాయం అందించాలని అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావ్, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్ సందీప్, ఆర్పీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా సఖి కేంద్రం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సఖి కేంద్రం సిబ్బంది

ఎదులాపురం, జనవరి 8 : బాధితులకు భరోసా, న్యాయం జరిగేలా సఖి కేంద్రం కృషి చేస్తుందని సైకోసోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. పట్టణంలోని శాంతినగర్, అబ్దుల్లా చౌక్‌లోని జనశిక్షణ సంస్థ ద్వారా కుట్టుమిషన్, బ్యూటీపార్లర్ శిక్షణ తీసుకుంటున్న మహిళాలకు సోమవారం అవగాహన నిర్వహించారు. బాధితులకు సఖి కేంద్ర ద్వారా న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతితో పాటు కౌన్సెలింగ్ అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సఖి కేంద్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు రూప, సంగీత, సుజాత, సఖి కేంద్రం సిబ్బంది ఉన్నారు.

తప్పిన ప్రమాదం

నార్నూర్, జనవరి 8 : నార్నూర్ మండల కేంద్రంలో సోమవారం పత్తి వ్యానుకు విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించగా, పెను ప్రమాదం తప్పింది. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామానికి చెందిన జాడే భీంరావ్ తన ఐచర్ వాహనంలో పత్తి లోడ్ చేసుకొని మాన్కాపూర్ జిన్నింగ్‌కు తీసుకెళ్తున్నాడు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, భీంరావ్ వాహనాన్ని పక్కన నిలిపి, కాలుతున్న పత్తిని కింద పడేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఎదులాపురం, జనవరి 8 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి తెలిపారు. మావల మండలం బట్టిసార్గవంలోని అంగన్‌వాడీ కేంద్రంలో, తలమడుగు మండలం కజ్జర్ల ప్రభుత్వ పాఠశాలలో సోమవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్‌క్రైమ్, హెల్ప్ లైన్లపై అవగాహన కల్పించారు. ఫోక్సో, గృహింస చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. స్పెషలిస్ట్ కోటేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ భగీరథ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, రాఘునాథ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అక్రమ గో వధశాలను తొలగించాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8 : ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో గల అక్రమ గో వధశాలను తొలగించాలని కాలనీవాసులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు వినతి పత్రం అందజేశారు. కొన్నేళ్లుగా గో వధశాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మున్సిపల్ కమిషనర్‌కు సైతం చాలాసార్లు విన్నవించినా సమస్యను పట్టించుకోవడం లేదని వాపోయారు. తక్షణమే గో వధశాలను తరలించాలని కోరారు. నాయకులు నెమలికొండ దయాకర్, ప్రణయ్‌చారి పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

నార్నూర్, జనవరి 8 : అయోధ్య శ్రీరామ మందిర పూజిత అక్షింతలను హిందూ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తాడిహత్నూర్, గుండాల, ఎంపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటా పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జ్ఞానోబా పుష్కర్, రాథోడ్ ప్రకాశ్, గోవింద్, సురేశ్, విశాల్, రాథోడ్ కైలాశ్ నాయక్, ఆడే భీంరావ్, జాదవ్ నీలేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

తాంసి(తలమడుగు), జనవరి 8 : హైదరాబాద్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్ రెడ్డిని సోమవారం తలమడుగ జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల్లోని 110 గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు సరిగా సరఫరా కాలేదని తెలిపారు. దీంతో గత నెలలో 15 రోజులు ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఆయనకు వివరించారు. వేసవి వస్తుండడంతో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని, మూడు మండలాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

దహిగూడలో వైద్యశిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8 : ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి పీహెచ్‌సీ పరిధిలోని దహిగూడలో రక్తహీనతపై సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, పవర్ ప్రేమ్‌సింగ్, ముయ్యాల మోతి రోహిదాస్, ఆశా తాక్ సండే జయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8 : ఆదిలాబాద్ జిలాల కేంద్రంలో గల కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో ఎస్‌వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ అధికారి, ఫౌండేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ మాట్లాడుతూ.. చలి దృష్ట్యా వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సిడాం రవి, చక్రపాణి, రోహిత్, నితీశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అభిలేష్ (ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, జనవరి 8 : బట్టి సావర్గం జాతీయ రహదారి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన అభిలేష్(29) సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఫీల్డ్‌లో పని ముగించుకొని గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బట్టిసావర్గం జాతీయ రహదారి వద్ద రాంగ్ రూట్‌లో కంటైనర్ లారీ వచ్చి, బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్ నుజ్జునుజ్జవగా, అభిలేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అభిలేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐటీడీఏ వద్ద అన్నదానం

భోజనం చేస్తున్న గిరిజనులు

ఉట్నూర్ రూరల్, జనవరి 8 : ఐటీడీఏ కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో గిరిజన దర్బార్‌కు వచ్చిన నిరుపేద గిరిజనుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ సర్పంచ్ ఆత్రం రాహుల్, నాయకులు ఎక్బాల్, లాజర్, రాధాబాయి, మహేందర్, భీమన్న, రాజేశ్వర్, నగేశ్, అక్షయ్ పాల్గొన్నారు.

కడ్తాల్‌కు కాలినడకన దీక్షాపరులు

కడ్తాల్‌కు బయల్దేరిన అయ్యప్ప దీక్షాపరులు

బజార్‌హత్నూర్, జనవరి 8 : బజార్‌హత్నూర్ అయ్యప్ప దీక్షాపరులు నిర్మల్ జిల్లాలోని కడ్తాల్ అయ్యప్ప క్షేత్రానికి సోమవారం కాలినడకన బయల్దేరారు. స్థానిక విఠలేశ్వర ఆలయంలో గురుస్వాములు పండరి, మల్లేశ్ చేతుల మీదుగా ఇరుముడులు కట్టుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, కాలినడకను ప్రారంభించినట్లు దీక్షాపరులు బత్తిని మురళీకృష్ణ, పడిపెల్లి మహేశ్ తెలిపారు.